ప్రజాశక్తి
గురువారం 19 డిసెంబరు 2024
5
శ్రీకాకుళం



ఆన్ కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆర్‌టిసిలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు అమరసింహుడు, కె.ఆర్.ఎస్ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు హెవీ లైసెన్స్ వచ్చి 18 నెలలు పూర్తి కావాలని, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈనెల 24వ తేదీలోగా శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 7382921647, 7382917289 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అల్పపీడనం తీవ్రం

- జిల్లాలో పలుచోట్ల వర్షాలు
- పైడిభీమవరంలో అత్యధికంగా 11.5 మి.మీ వర్షం
- మరో మూడు రోజుల పాటు వానలు పడతాయని హెచ్చరిక
- ధాన్యం కొనుగోలుపై ప్రభావం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడంగా తీవ్ర అల్పపీడనంగా మారింది. దీని ప్రభావంతో జిల్లాలో బుధవారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. జిల్లాలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మరోవైపు చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. జిల్లాలో ముమ్మరంగా నూర్పులు జరుగుతున్నాయి. వర్షాలు పడుతుండడంతో తేమ చేరకుండా ధాన్యం భద్రపరుచుకుంటున్నారు. పొలాల నుంచి ఇళ్లకు తరలించిన ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి తదితర ప్రాంతాల్లో పంట చేతికొచ్చినా వర్షాలను దృష్టిలో పెట్టుకుని కోతలను వాయిదా వేసుకుంటున్నారు.

తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాత్రి ఎనిమిది గంటల సమయానికి రణస్థలం మండలం పైడిభీమవరంలో అత్యధికంగా 11.5 మి.మీ వర్షం కురిసింది. జి.సిగడాంలో 7 మి.మీ వర్షం పడింది. లావేరు మండలం తామాడలో అత్యధికంగా 6.75 మి.మీ, కవిటి మండలం రాజపురంలో 5.5 మి.మీ, సోంపేట మండలం బాతుపురంలో 4 మి.మీ, ఆమదాలవలస మండలం తిమ్మాపురంలో 3.75 మి.మీ వర్షం కురిసింది. సరుబుజ్జిలి మండలం విజయరామపురంలో 3.5 మి.మీ, మందస మండలం హరిపురం, టెక్కలి మండలం రావివలస, గార, బూర్జ మండలం కొల్లివలస, జలుమూరు ప్రాంతాల్లో 2.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కోటబొమ్మాళి, సంతబొమ్మాళిలో చెరో 1.5 మి.మీ చొప్పున వర్షం పడింది. కంచిలి, ఇచ్ఛాపురం, రాగోలు, పొందూరు, ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట తదితర ప్రాంతాల్లో 1.25 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం నగరంలో 0.5 మి.మీ వర్షం కురిసింది.

ధాన్యం కొనుగోలుపై వర్షాల ప్రభావం

జిల్లాలో రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు ధాన్యం సేకరణకు ఇబ్బందిగా మారింది. ధాన్యంలో 17 శాతం తేమ శాతం దాటితే వాటిని అధికారులు తీసుకునే పరిస్థితి ఉండకపోవడంతో, రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. వర్షాలు పడుతుండడంతో అటు ధాన్యం రవాణా, తరలింపునకూ ఇబ్బందిగా మారింది. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు మందగించాయి. జిల్లాలో ఈ ఏడాది 3,59,495 ఎకరాల్లో వరి పంట సాగయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 2.15 మెట్రిక్ టన్నులను సేకరించారు. రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు మందగించినట్లు తెలుస్తోంది.

విషాదం

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన త్రివేణి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని పాకివలస సమీపంలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం సన్యాసిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సంపతిరావు త్రివేణి (31) బుధవారం మృతి చెందారు. జాతీయ రహదారిపై టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి పక్క రోడ్డులోకి దూసుకెళ్లింది. అదే సమయంలో ఆమదాలవలస మండలం తిమ్మాపురానికి చెందిన త్రివేణి పాఠశాలకు కొత్తపేట వరకు బస్సులో వచ్చి అక్కడ్నుంచి తన స్కూటీపై పాఠశాలకు బయలుదేరారు. పాకివలస సమీపంలోకి వచ్చేసరికి అదే సమయంలో టెక్కలి నుంచి నరసన్నపేట వెళ్తున్న కారు టైరు పంక్చర్ అయి పల్టీలు కొట్టి పక్క రోడ్డులో వెళ్తున్న త్రివేణిపై పడడంతో అమె అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. ఎస్ఐ వి.సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న కంచిలికి చెందిన గుడ్ల పైడిరాజు, అతని భార్య శైలజకు గాయాలు కావడంతో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతురాలు త్రివేణి భర్త కిల్లి సింహాచలం ఒక ప్రైవేటు బ్యాంకులో రికవరీ మేనేజర్‌గా పనిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు చైత్ర (6), ఇషిక (3) ఉన్నారు. త్రివేణి ఏడాది కిందటే చిత్తూరు జిల్లా నుంచి ఒప్పంద బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



త్రివేణి (ఫైల్‌ఫొటో)



బోల్తా పడిన కారు

శోకసంద్రంలో తిమ్మాపురం

ఆమదాలవలస : మున్సిపాల్టీ పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురానికి చెందిన ఉపాధ్యాయురాలు త్రివేణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా, సందడిగా ఉండే త్రివేణి ఇక లేదన్న విషయం తెలియడంతో పలువురు కంటతడి పెట్టుకున్నారు. తన ఇద్దరు కుమార్తెలను అంగన్వాడీ కేంద్రంలో విడిచిపెట్టి తను విధులు నిర్వహిస్తున్న పాఠశాలకు బయలుదేరి వెళ్లిందని, ఇంతలోనే ఎంత ఘోరం జరిగిపోయిందని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన గంటలోనే ఆమె భర్త సింహాచలంకు త్రివేణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఫోన్ కాల్ రావడంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి.

యుటిఎఫ్ సంతాపం

టెక్కలి : త్రివేణి మృతికి టెక్కలి మండల యుటిఎఫ్ అధ్యక్షులు పి.గణపతిరావు, కార్యదర్శి తమ్మినేని వైకుంతరావు, గౌరవాధ్యక్షులు ఎం.కుమారస్వామి తదితరులు సంతాపం తెలిపారు. ఘటనా ప్రదేశానికి చేరుకున్న నాయకులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించే వరకు అక్కడే ఉండి సేవలందించారు. మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.



దగ్ధమైన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

30 ధాన్యం బస్తాలు దగ్ధం

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని జగన్నాథపేట సమీపంలోని పంట పొలాల్లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 30 బస్తాల ధాన్యం దగ్ధమయ్యాయి. బలద గ్రామానికి చెందిన పూర్ణచంద్ర పాణిగ్రాహి రెండు రోజుల కిందట నూర్పు యంత్రంతో కోత కోసి బస్తాలను నెట్టువేశాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చాక అగ్నికి ఆహుతి కావడంతో కన్నీటిపర్యంతమయ్యాడు. రూ.55,500 నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం అందుకున్న ఆర్ఐ ఐ.కృష్ణారావు, విఆర్ఒ రాజగోపాలరావు బుధవారం పరిశీలించారు. ప్రమాద విషయాన్ని రైతుని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనట్లు తెలిపారు.

ఉత్సాహంగా పోలీసు క్రీడలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీసులకు మానసిక ఒత్తిడిని తగ్గించి వారిలో క్రీడా స్ఫూర్తిని కల్పించేందుకు స్థానిక జిల్లా పోలీసు ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్లు, ఆర్మ్‌డ్ రిజర్వు, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డు విభాగాలకు చెందిన పోలీసు జట్లు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నాయి. పోలీసు అధికారులు, సిబ్బంది తమ హోదాల తారతమ్యం లేకుండా ఉత్సాహంగా పలు పోటీల్లో పాల్గొని, తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.

క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, స్లో సైకిల్ రేస్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. 100, 400 మీటర్ల పరుగు, ఇతర క్రీడల్లో మహిళా, పురుషులకు వేర్వేరుగా నిర్వహించగా, పోలీస్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ క్రీడలు రేపటితో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న పోలీసులు



యువతకు గరిమెళ్ల స్ఫూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్వాతంత్ర్య ఉద్యమంలో గరిమెళ్ల సత్యనారాయణ నిస్వార్థంగా దేశభక్తి భావంతో నిర్వహించిన పాత్ర నేటి యువజనులకు స్ఫూర్తి కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని గ్రంథాలయ సమావేశ మందిరంలో బుధవారం గరిమెళ్ల వర్ధంతి సభను నిర్వహించారు. గరిమెళ్ల చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన జీవితంలో గరిమెళ్ల రచనలు స్ఫూర్తిదాయక పాత్ర పోషించాయని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. గరిమెళ్ల జీవిత విశేషాలను, స్వాతంత్ర్య పోరాట కాలంలో ఆయన చూపిన తెగువ, ధైర్య సాహసాలను ప్రియాగ్రహారం గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి బాడాన రాజు సోదాహరణంగా వివరించారు. నేటి యువత ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆయన జీవిత చరిత్ర నుంచి పాఠాలు తీసుకోవాలన్నారు. గరిమెళ్ల సత్యనారాయణ మనవడు అశోక్ లక్ష్మణ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాకొద్దీ తెల్ల దొరతనం గేయాన్ని వివరిస్తూ పాడి సభికులను సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు ఆహ్లాదపరిచారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వి.జి.కె మూర్తి విజ్ఞాన కేంద్రం విధానాలు, కార్యక్రమాలను వివరించారు. అతిథులను కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆహ్వానించగా, కోశాధికారి పి.సుధాకరరావు, ప్రముఖ రచయిత బాడాన శ్యామలరావు, ఎం.ఆదినారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. గురజాడ దేశభక్తి గీతంతో ప్రారంభమైన సభ ఎం.ప్రభాకరరావు వందన సమర్పణతో ముగిసింది.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా రమేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కొత్త అధ్యక్షునిగా బోయిన రమేష్ ఎన్నికయ్యారు. నగరంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులంతా ఆయన్ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఆర్.వి.వి.ఎస్ వెంకటేశ్వరరావు (వాసు) అధ్యక్షునిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం, పదవీకాలం ముగియడంతో ఆయన ఇటీవల రాజీనామా చేశారు. అసోసియేషన్‌కు అధ్యక్షునిగా వాసు కొనసాగడం ఏమాత్రం ఇష్టపడని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అతనితో రాజీనామా చేయించారనే ప్రచారం ఇటీవల కాలంలో జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో బోయిన రమేష్‌ను కొత్త అధ్యక్షునిగా ఎన్నికున్నారు.

ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు. రైస్ మాఫియాపై ఉక్కుపాదం మోపడం అభినందనీయమేనని, ఇదే క్రమంలో రైస్ మిల్లర్లను దోషులుగా చూడడం సరికాదన్నారు. ధాన్యం సేకరణకు మిల్లర్లంతా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. పూర్వ అధ్యక్షులు వాసు మాట్లాడుతూ తనకు సహకరించిన మిల్లర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రమేష్‌ను మిల్లర్లు గజమాలతో సత్కరించారు.



రమేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల : మూడేళ్ల న్యాయ విద్య కోర్సుల్లో మిగులు సీట్లకు ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి (ఒసి 45 శాతం, బిసి 42 శాతం, ఎస్‌సి, ఎస్‌టి 40 శాతం మార్కులు) లాసెట్-2024లో ర్యాంకు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని స్పష్టం చేశారు. మొదటి, రెండు కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు క్యాంపస్‌కు రావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో పాటు లాసెట్ ర్యాంకు కార్డు, టిసి కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. అవసరం మేరకు కుల, ఇడబ్ల్యుఎస్, నివాస సంబంధిత ధ్రువపత్రాలతో రావాలని తెలిపారు. అన్ని కేటగిరీలకు చెందిన వారు రూ.వెయ్యి రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాల నకలు, అభ్యర్థి ఫొటోలు కూడా తీసుకురావాలని తెలిపారు.

రెండు రోజుల్లో వంతెన పనులు పునరుద్ధరణ

ఆర్‌డిఒ వెంకటేష్

ప్రజాశక్తి - పలాస

పలాస రైల్వే ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి వంతెన నిర్మాణ పనులు పునరుద్ధరించాలని ఆర్‌డిఒ డి.వెంకటేష్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. పలాస రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతాన్ని రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా 89మంది లబ్ధిదారులు ఉండగా, దుకాణాలు, నివాసాలు, ఇళ్ల స్థలాలు 128 ఉన్నాయని చెప్పారు. అందులో 79 మంది లబ్ధిదారులకు ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించామన్నారు. మరో పది మంది లబ్ధిదారులకు పలు కారణాలతో నష్టపరిహారం చెల్లించలేకపోయామని చెప్పారు. వారి పూర్తి వివరాలను ఈనెల 19న తహశీల్దార్ కార్యాలయానికి తీసుకుని రావాలని లబ్ధిదారులకు చెప్పామన్నారు. మరో రెండు రోజుల్లో ఆర్అండ్‌బి అధికారులు కొలతలు తీసుకొని పనులు చేపట్టాలని సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఆర్అండ్‌బి డిఇఇ ఎస్.రామినాయుడు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

వినియోగదారుల హక్కులపై...

అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యాన జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను బుధవారం నిర్వహించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన తక్కువగా ఉంటుందని, అక్కడి ప్రజలకు చైతన్యం చేయాలని సూచించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కళాశాల కామర్స్ హెచ్ఒడి ఎ.కృష్ణారావు మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో వినియోగదారులు ప్రకటనల ద్వారా చాలా మోసపోతున్నారని చెప్పారు. వినియోగదారుల హక్కులపై అవగాహన ఉంటే వస్తు సేవలు కొనుగోలులో మోసాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అర్థశాస్త్ర అధ్యాపకులు ఆదిలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులకు జరిగిన అన్యాయం నుంచి రక్షణ పొందడానికి ఈ చట్టాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అధ్యాపకులు ప్రభాకరరావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు గరిమెళ్ల పేరు పెట్టాలి

పోలాకి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజా కవి గరిమెళ్ల సత్యనారాయణ పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టాలని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాడాన రాజు ప్రభుత్వాన్ని కోరారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన గరిమెళ్ల సత్యనారాయణ 72వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాడాన రాజు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో జిల్లాకు సుస్థిర స్థానం కల్పించిన గరిమెళ్ల పేరు జిల్లాకు పెడితే ఆ మహనీయునికి ఘన నివాళి కాగలదన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో గరిమెళ్ల పేరు జిల్లాకు పెట్టాల్సిన ఆవశ్యకతపై సాహితీవేత్తలు, పలు ప్రజాసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నామని చెప్పారు. ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఐ.గణపతిరావు మాట్లాడుతూ గరిమెళ్ల జీవిత చరిత్రను నేటితరం తెలుసుకునే విధంగా పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గరిమెళ్ల పేరుతో ఉన్న కళాశాలలో పనిచేయడం అదృష్టమన్నారు. ఆయన పేరుతో ఉన్న కళాశాల, పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు కోశాధికారి డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గరిమెళ్ల జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఐ.గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్లదొరతనం పాట అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు బాడాన రాజు, దుబ్బ కోటేశ్వరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు, అధ్యాపకులు నాగేంద్రశర్మ, ధనుంజయరావు, గోపి, గౌరీశంకర్, సాహితీవేత్తలు, అభిమానులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో రమ్యశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

62వ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఆర్.వి రమ్యశ్రీ బ్రాంజ్ మెడల్ సాధించింది. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈనెల ఐదో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో రమ్యశ్రీ ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొని ఈ మెడల్ సాధించింది. పతకం సాధించిన రమ్యశ్రీని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవి వెంకటాచలం, స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ జి.పరశురాం, కార్యదర్శి సనపల నర్సింహమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ గౌరినాయుడు, అడిషనల్ డైరెక్టర్ జాకబ్ అభినందించారు.



రమ్యశ్రీని అభినందిస్తున్న రవి వెంకటాచలం తదితరులు



విప్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజల రుణం తీర్చుకోలేనిది

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్ అన్నారు. మండలంలోని బి.జి.పుట్టుగలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్నిరంగాల్లో సంక్షేమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి తన కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు బి.రమేష్, సీపాన వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, లోల్ల శ్రీను, గొనప సంతోష్, పండి దేవేంద్రమూర్తి, సంతోష్ పట్నాయక్, పుల్లల రాజు, రెయ్యి సోమేష్, జనసేన నాయకులు హరి బెహరా, లోల్ల సాగర్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సుస్థిర అభివృద్ధే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకలి బాధలను నివారించి ఆహార భద్రత కల్పించడం, నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, లింగ అసమానత్వం రూపుమాపడం వంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం ద్వారా ఈ లక్ష్యాలు సాధించగలుగుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి ప్రపంచంలో మన దేశాన్ని, దేశంలో మన రాష్ట్రాన్ని ఉత్తమంగా నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, పేరాడ ఆనందరావు, అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జుత్తు చిన్ని పాల్గొన్నారు.



లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

లావేరు: వివిధ రకాల భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు కోరారు. మండలంలోని కేశవరాయనిపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యుటేషన్, ఎల్‌పిఎం నంబర్లలో తేడా, విస్తీర్ణంలో వ్యత్యాసం, భూ ఆక్రమణ గురైన సమస్యలను వివిధ దశల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 25 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ బళ్లాడ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆర్.ప్రకాశరావు, సర్పంచ్ వై.ఆదినారాయణ, విఆర్ఒ గోవిందరావు, నాయన శాంతారెడ్డి పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

పలాస : రైతుల సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిటి లక్ష్మీనారాయణ, భూ రీసర్వే డిటి వాయిలపల్లి సునంద అన్నారు. మండలంలోని రెంటికోట, కేదారిపురం పంచాయతీ పరిధిలోని రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో 62 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కంచరాన భగేశ్వరరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బడే పాపారావు సూచించారు. మండలంలోని పెద్దపద్మాపురం, మర్రిపాడు-సి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ మేరకు రైతుల నుంచి 6 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, భూ రీ సర్వే డిటి వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధులు రవ్వల గణపతిరావు, మాలతి శ్రీధర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలి సమీప పొలంలో గుర్తుతెలియని 75 ఏళ్ల వృద్ధుడు మతి చెందాడు. పది రోజులుగా వృద్ధుడు మద్యం తాగి గ్రామంలో తిరుగుతుండేవాడని గ్రామస్తులు తెలిపారు. కొల్లాన సూర్యనారాయణ పొలంలో వృద్ధుడు బుధవారం శవమై కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఒడిశా ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.



నిందితుడిని ప్రవేశపెట్టిన డిఎస్‌పి వివేకానంద

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

డిఎస్‌పి వివేకానంద

ఆమదాలవలస : మండలంలోని ఆర్ఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి వివాహిత దామోదర పద్మ హత్య కేసులోని నిందితుడు సొండి సురేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఆర్ కాలనీకి చెందిన దామోదర పద్మ భర్త కృష్ణ మృతితో ఆమె తన ఇంటి వద్ద కిరాణా షాపు పెట్టుకొని జీవిస్తుండేదని తెలిపారు. అదే గ్రామానికి చెందిన సొండి సురేష్ పద్మతో చనువుగా ఉంటూ తరచూ ఫోన్లో సంభాషిస్తూ అవసరానికి డబ్బులు ఇస్తూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపారు. మూడు నెలలుగా పద్మ వేరే వ్యక్తితో మాట్లాతుండడంతో ఆమెపై కక్షపెంచుకుని పథకం హత్య చేశారని తెలిపారు. హత్య అనంతరం కాలనీకి వెనుక బాగానే ఉన్న సంగమేశ్వర కొండపైకి పారిపోయి దాక్కున్నాడని వివరించారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా సంగమేశ్వర కొండ దగ్గర పోలీసులు అదుపులో తీసుకొని అరెస్టు చేసినట్లు వివరించారు. సురేష్ గతేడాది జూన్‌లో పోలాకి మండలం ప్రియాగ్రహారానికి చెందిన ఒక మహిళా వాలంటీర్‌ను వేధింపుపై పోలాకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. చాకచక్యంగా వ్యవహరించి సురేష్‌ను అరెస్టు చేసిన సిఐ పి.సత్యనారాయణకు, ఎస్ఐ కె.వెంకటేష్‌కు, పోలీస్ సిబ్బందికి డిఎస్‌పి అభినందించారు.



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న శ్యామ్ మాథ్యూస్

కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఉద్దేశమని ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు చింతాడలో న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్ ప్రాంగణంలో న్యూ లైఫ్ టైలరింగ్ శిక్షణా కేంద్రంలోని మహిళలకు కుట్టు మిషన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం సాధికారత సాధించాలన్నారు. ఆరు నెలల కాలం పాటు తమ సంస్థలో టైలరింగ్ విభాగంలో శిక్షణ పొందిన తొమ్మిదవ బ్యాచ్ మహిళలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం పాల్గొన్నారు.

షణ్ముఖకు అభినందనలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో ఉపాధ్యాయులకు నిర్వహించిన రాష్ట్ర సాంస్కృతిక పోటీల్లో మండలానికి ఐదు బహుమతులు వచ్చాయని యుటిఎఫ్ నాయకులు యర్నాగుల వాసుదేవరావు బుధవారం తెలిపారు. మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖ మాస్టర్‌కు టీచర్ 2040 ఎడి నాటికకు ప్రథమ బహుమతి, పప్పెట్రీకి ప్రథమ బహుమతి, అభ్యుదయ గీతాల్లో ప్రత్యేక ప్రశంసా బహుమతి కైవశం చేసుకున్నారని అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర పోటీలకు ఐదుగురు పాల్గొనగా, మొత్తం 8 బహుమతులు పొందారని అన్నారు. కోటబొమ్మాళి మండలానికి చెందిన షణ్ముఖరావుకు 3, బడగల చిన్నారావుకు 2 గెలుపొందడంతో హర్షం వ్యక్తం చేశారు. అలాగే నందిగాంకు చెందిన బి.శంకరరావు, పాతపట్నానికి చెందిన చిరంజీవి, టెక్కలికి చెందిన దుర్యోధనలు ఒక్కొక్కటి చొప్పున బహుమతులు పొందారని చెప్పారు. వీరికి జనవరి 5న నుంచి కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలో బహుమతులు అందజేస్తారని తెలిపారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

వాతావరణం పూర్తిగా తేరుకునే వరకు రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు, కవిటి తహశీల్దార్ మురళీమోహన్ తెలిపారు. మండలంలోని పుటియాదల, చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, బొరివంక, జగతి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఇప్పటికే కోసిన పంటను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటాయని, తొందరపడి వాతావరణం తేరుకోకుండా కోతలు కోయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎఒ బి.దుర్గాప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.శ్రీకళ్యాణ్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రానున్న మూడు రోజులు అధిక వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బడే పాపారావు సూచించారు. ఎఒ దానకర్ణుడు, పౌర సరఫరాల డిటి బి.ప్రసాదరావుతో కలిసి మండలంలోని పెద్దపద్మాపురం, పడ్డ, డబారు, కోసమల, పట్టుపురం, చాపర గ్రామాల్లో పర్యటించారు. ఈ మేరకు తుపానుపై రైతులను అప్రమత్తం చేశారు. వరి కోతలు 4 రోజులు పాటు వాయిదా వేసుకోవాలని తెలియజేశారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లు వేసుకోవాలన్నారు. టార్పాలిన్లు అవసరం అనుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.



మెళియాపుట్టి : రైతులకు సూచనలు ఇస్తున్న తహశీల్దార్ పాపారావు

యాజమాన్య పద్ధతులతో పంట దిగుబడి

ఆమదాలవలస : సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక పంట దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని కణుగులవలసలో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులు ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూక అప్పల సూరన్నాయుడు (రాజు), గ్రామ వ్యవసాయ సహాయకులు పి.సంతోష్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సత్యవతి

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలస, కె.కె.రాజపురం, గుత్తావల్లి ఎరువుల దుకాణాలను ప్రత్యేక తనిఖీ అధికారి జి.సత్యవతి బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు దుకాణాల్లో వంద రోజుల పైబడి ఆన్‌లైన్‌లో అమ్మకాలు చూపించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సకాలంలో డిబిటి చేయకపోతే ప్రభుత్వం నుంచి సరఫరా చేసే సబ్సిడీ ఉండదని, సకాలంలో సొసైటీ సిబ్బంది, డీలర్లు డిబిటి చేయించుకోవాలని సూచించారు. సకాలంలో అమ్మకాలు ఆన్‌లైన్‌లో చూపించకపోతే దుకాణాలకు రావాల్సిన ఎరువుల కేటాయింపులూ తగ్గిపోతాయని తెలిపారు. దాదాపుగా 15 టన్నుల యూరియా, ఎరువులు గత రెండేళ్లుగా బూర్జ సొసైటీలో పెండింగ్ ఉన్నట్లు గుర్తించారు. అది సరిచేయని పక్షంలో లైసెన్స్ రద్దు చేసి, లీగల్ నోటీస్‌లు పంపిస్తామని సొసైటీ ముఖ్య నిర్వహణ అధికారిని హెచ్చరించారు. అలాగే కొల్లివలస, గుతావల్లి రైతు సేవా కేంద్రాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం నూతన అధ్యక్షునిగా త్రినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



త్రినాథ్‌రెడ్డి

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన అధ్యక్షునిగా కోట త్రినాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు అధ్యక్షతన బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ధర్మవరపు గౌతమి, కోశాధికారిగా కుమ్మరి కామరాజు, ఉపాధ్యక్షునిగా నొక్కు ఈశ్వరరావు, యాదం భాగ్యలక్ష్మి, గౌరవాధ్యక్షునిగా కొర్రాయి యాదవరాజు, ముఖ్య సలహాదారుగా సవర వెంకటస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెవర మోహనరావు, ఆర్గనైజింగ్ సెక్రయిటరీగా రోణంకి మధు, ఆఫీస్ బేరర్‌గా హనుమంతు శరత్చంద్ర దొరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- పలాస

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాల ఖోఖో పోటీలో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్.గణపతి, ఎస్.ప్రదీప్, ఎస్.వాసుదేవరావు, ఎ.ఎస్.వంశి, ఎస్.చంటి, కె.దీపికలు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. బాలురు విభాగంలో ఐదుగురు, బాలికలు విభాగంలో ఒకరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బాలురు విభాగానికి చెన్నయ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ, బాలికల విభాగానికి పాండిచ్చేరిలో నిర్వహిస్తారని అన్నారు. శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ పి.మధును ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లంఊటలు ధ్వంసం

సోంపేట : సోంపేట ఎక్సైజ్ పరిధిలోని మందస మండలం చాపరాయి గ్రామ సమీపంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సుమారు 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేయడంతో పాటు 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ బేబీ తెలిపారు. సోంపేట, నరసంపేట మండలాలకు చెందిన ఎక్సైజ్ సిబ్బంది, మొబైల్ టీం ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. నాటుసారా పూర్తిగా అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ముగ్గురు అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు : గ్రామాల్లో వివిధ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పట్టుకుని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. టెక్కలి సమీపంలోని గోపీనాథ్‌పురానికి కొమ్ము కార్తీక్, గాలి వెంకట శివ, ఎన్.నాగరాజులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి నాలుగు సెల్ ఫోన్లు, 30 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో కార్తీక్, వెంకటశివలది గుంటూరులోని వినుకొండ కాగా, ఇక్కడ కొంతకాలంగా ఉంటున్నారు.

తప్పుడు ఫిర్యాదులు చేస్తే సహించం

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ఐసిడిఎస్ సిడిపిఒపై తప్పుడు ఫిర్యాదులు కృష్ణారావు పేరుతో సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేశారని, అది తప్పుడు ఫిర్యాదులని అంగన్వాడీ ప్రాజెక్టు సెక్టార్ నాయకులు శాంతామని, రాణి, నారాయణమ్మ, లలిత, లీలారాణి, సావిత్రి, ఉషారాణి ఖండించారు. పాతపట్నం కాలనీ రెండో వీధిలో అంగన్వాడీ కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు పేరుపెట్టి తప్పుడు ఫిర్యాదులు ఎవరైనా చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ నెల 9న తప్పుడు ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారని అన్నారు. ఈ ఫిర్యాదు మేరకు మాకు ఎటువంటి సంబంధం లేదని, ఇకనుంచి ఎవరైనా తప్పుడు ఫిర్యాదులు సమంజసం కాదని అన్నారు. సమావేశంలో కె.సుజాత, ఎస్.రమ, ఎస్.శారద, డి.శ్రీలక్ష్మి, కుసుమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెక్టార్ నాయకులు



పరామర్శిస్తున్న ఎంపిపి పద్మ

ఉపాధ్యాయినికి పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

ఆగంతుకుని దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బల్లెడ భారతిని ఎంపిపి కడియాల పద్మ, ప్రకాష్ బుధవారం పరామర్శించారు. జరిగిన దాడిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రశాంతమైన మండలంలో ఇటువంటి అనూహ్య సంఘటన కలకలం రేపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి భవిష్యత్‌లో ఇటువంటివి జరగకుండా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు యలమంచి నీలయ్య, పిరియా ఆనంద్, ఎన్ని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల కాలంలో మండలంలో వరుస చోరీలతో భయభ్రాంతులకు లోనవుతున్న ప్రజలకు భరోసా కల్పించాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లొల్ల రాజేష్ కోరారు. ఈ మేరకు ఎఎస్ఐ కూర్మారావును బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని అన్నారు. ఇకనైనా అపరిచిత, అనుమానిత వ్యక్తులపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రాజేష్



ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

బిజెపిది నియంతృత్వం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వంతో ప్రజల హక్కులు కాలరాస్తున్నాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సురేష్ పానీగ్రాహి అన్నారు. కటక్‌లో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. ముందుగా మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనంతగా మతోన్మాదం ఊడలు చాచిందన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజపతి జిల్లా నుంచి ముచ్చి బంగారయ్య, దొండపాణి రైతో తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

టెక్కలి: గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేసేవిధంగా మెళియాపుట్టి మండల కేంద్రంగా చేసుకుని ఐటిడిఎను ఏర్పాటు చేయాలని సిపిఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు డిమాండ్ చేశారు. మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పరిధిలోని ముఖలింగాపురం, బెమడకాయలపేట, చిరుతనాపల్లి, గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విభజన నుంచి ఇప్పటి వరకు ఐటిడిఎ ప్రస్తావన లేకపోవడంతో 16 మండలాల పరిధిలోని గిరిజనులు అనాథులుగా మారుతున్నారని అన్నారు. గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. గిరిజనేతరులను ఎస్‌టి జాబితాలో చేర్చరాదని కోరారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, అరుణోదయ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు సోమేశ్వరరావు, దేవేంద్రరావు, సూరమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



పర్యటిస్తున్న నాయకులు

ఘనంగా కేంద్రమంత్రి జన్మదినం



నరసన్నపేట : కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- కవిటి

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ చింతామణి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం రానయ్యలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే టిడిపి శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, ఆరింగి మధు, బెందాళం విజయ్ పాల్గొన్నారు.

నరసన్నపేట : కేంద్ర పౌర విమానయనశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కేక్‌ను కట్‌చేసి టిడిపి కార్యకర్తలకు పంచిపెట్టారు. కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, సాగునీటి డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్లు ఎం.వెంకట అప్పలనాయుడు, ఎస్.చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, లుకలాపు రాంబాబు, చిన్నబాబు పాల్గొన్నారు.

పాతపట్నం : ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవనంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట టిడిపి నాయకులు కలిశెట్టి అప్పన్న ఉన్నారు.

అలాగే ఎమ్మెల్యే కుమారుడు డాక్టర్ సాయి గణేష్, టిడిపి నాయకులు కేక్‌ను కట్ చేశారు. పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు సూచనల మేరకు జెమ్స్‌కు వెళ్తున్న బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, శివాల చెన్నయ్య, కలమట భుజంగరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : న్యూఢిల్లీలో రామ్మోహన్ నాయుడుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు.

నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలను నాటారు. భవాని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆహారం పంపిణీ చేశారు. కూటమి నాయకులు మెండ దాసునాయుడు, పిసిని చంద్రమోహన్, బిర్లంగి రామ్మోహన్, పీరుకట్ల విశ్వప్రసాద్, దానేటి శ్రీధర్, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి దుంగ భాస్కర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావులు కేక్‌లు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో రామ్మోహన్ నాయుడు జన్మదిన సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రుద్రమరాణి, ఎస్.మాధవీలత హేమ, పద్మజ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపిలు సలాన మోహనరావు, బైరిసింగి లక్ష్మీనారాయణ, మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, నంభాల వెంకటరావు, బూరెల లలిత కుమారి, ఎల్.వాసు, పడాల శ్రీను, కోట తిరుపతిరావు, చాపర మాధవరావు, అగ్గాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం : స్థానిక సేచ్ఛావతి ఆలయంలో రామ్మోహన్ నాయుడు పేరున టిడిపి కూటమి నాయకులు పూజలు చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేవారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, దక్కత ఢిల్లీరావు, కాళ్ల ధర్మారావు, కర్రి మన్మథరావు, కర్రి నాగరాజు, దాసరి శేఖర్, దక్కత కామేశ్వరరావు, డాక్టర్ పాతర్ల దేవేంద్ర పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో రామ్మోహన్ నాయుడు జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, పి.సాంబమూర్తి, నెయ్యిల సూర్యనారాయణ, అంబటి రామకృష్ణ, అఖిల్, వంక రామారావు, ఎ.ఉమామహేశ్వరరావు, లాండ వాసు పాల్గొన్నారు.

టెక్కలి : టిడిపి కార్యాలయంలో రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా టిడిపి మండల అధ్యఓఉలు బగాది శేషగిరి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. స్థానిక సత్యసాయి సేవా సమితి నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మట్ట పురుషోత్తం, పోలాకి షణ్ముఖరావు, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లిప్రసాద్‌రెడ్డి, బెహరా కాళీ, మల్లిపెద్ది మధు, కొళ్ల కామేష్, పరపటి చిన్నయ్యరెడ్డి, కోరాడ రాంప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరు : రామ్మోహన్ నాయుడు జన్మదిన సందర్భంగా టిడిపి నాయకులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. అనంతరం బోర శ్రీరాములు కళ్యాణ మండపంలో టిడిపి నాయకులు అగతముడి భైరాగినాయుడు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అగతముడి అరుణ్‌కుమార్, మాధవరావు, మాతల గాంధీ, పి.మోహనరావు, నాగల అప్పన్న, దాసునాయుడు, కమలాకర్, కోటి, కె.వెంకటరావు, ఎం.కృష్ణ, పి.అమర్, సిహెచ్.వెంకటరమణ, కె.రామారావు, వాసు, చక్రధర్ పాల్గొన్నారు.



పలాస : పళ్లు పంపిణీ చేస్తున్న బాబూరావు

పలాస : స్థానిక టిడిపి కార్యాలయంలో రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, మల్లా శ్రీనివాసరావు, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ టిడిపి కార్యాలయంలో రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూపరెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సోంపేట : రామ్మోహన్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మామిడిపల్లిలో మహాత్మ యువజన సంఘం ఆధ్వర్యాన 500 నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పొత్ర కండకు చెందిన డి.శివ ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషగిరి, విశాఖ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శేషగిరి, పాతిన కృష్ణమూర్తి, ఆర్.వాసు, కృష్ణారావు, నాని, కె.కృష్ణారావు, జి.లింగరాజు, టి.కిరణ్, నవీన్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.



సోంపేట : దుప్పట్లను పంపిణీ చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

మైనారిటీ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మైనారిటీ చట్టాలు తెలియకపోవడంతో మైనారిటీలు నష్టపోతున్నారని సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు మేరకు కోర్టులో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగంలో అందుతున్న హక్కులు ఉన్నా ప్రత్యేకంగా మైనారిటీలకు ఉన్నాయని అన్నారు. ఆర్టికల్ 29 (1) భాగంగా వారి సంస్కృతి, భాష, గుర్తించాలని సూచించారు. ఆర్టికల్ 30లో వారికి కావాల్సిన చదువుకు సంబంధించి ఇన్సిటిటూషన్ కల్పించుకోవచ్చునని అన్నారు. ఆర్టికల్ 340 కింద కొన్నికొన్ని గ్రూపులు వారు మాట్లాడే భాషను మనం ఎత్తి చూపకూడదని తెలిపారు. వీటికి సంబంధించి ఫోరాలు ఉన్నాయని తెలిపారు. అందరూ రాజ్యాంగానికి లోబడి హక్కులని, బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న అధ్యాపకులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంతీయ స్థాయి అంతర్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో క్రమ శిక్షణ, ఏకగ్రత పెరుగుతుందన్నారు. క్రీడలు వల్ల ఒత్తిడి తగ్గి ఉత్సాహంగా ఉండటానికి ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య మాట్లాడుతూ ఈ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దామోదరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : దుప్పట్లు పంపిణీ చేస్తున్న గృహాలక్ష్మి

దుప్పట్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు: మండలంలోని చీపురుపల్లి పంచాయతీ ఎం.గడూరులో బైపల్లి-వెంకటాపురం అమ్మనాన్న మెమోరియల్ ట్రస్టు చైర్‌పర్సన్ మరడ గృహాలక్ష్మి పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలంలో చలితో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్రస్టు చేయూతగా దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సందక్కమ్మ సేవా సంఘం అధ్యక్షులు సాతుపల్లి శేషయ్య, ఎస్.కామేశ్వరరావు, ఎస్.ఉపేంద్ర, జోగ కోదండరావు పాల్గొన్నారు.

దుస్తులు...

నరసన్నపేట: పంచాయతీ ఇఒ దాక్షాయణి పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. స్థానిక పెద్దలు వేణుగోపాల్ గుప్త (సైకిల్ బాబు) జన్మదిన సందర్భంగా సుమారు 60 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశామన్నారు. ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అబినందనీమని అన్నారు. కార్యక్రమంలో జామి వెంకటరావు, పీస కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

టెక్కలి : సమాజంలోని వ్యక్తులు తమ బాధ్యతలను కాపాడుకుంటూనే తమ హక్కులనూ గుర్తించాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ కోరారు. జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, అధ్యాపకులు ఎ.రామారావు, కంచరాన శ్రీనివాసరావు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

లావేరు : జాతీయ వినియోగదారుల వారోత్సవాలు సందర్భంగా బుడుమూరు ఉన్నత పాఠశాలలో కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వినియోగదారుల రక్షణ చట్టం స్ఫూర్తిని, లక్ష్యాన్ని అర్థం చేసుకుని హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్రమ వ్యాపార విదానాల భారిన పడకుండా, మోసపూరిత ప్రకటనలతో ప్రభావితం కాకుండా నాణ్యమైన వస్తు సేవలను కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకీ బిల్లు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఉరిటి శ్రీనివాస రావు ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, పడాల తవిటినాయుడు, సీర రమేష్‌బాబు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : జాతీయ వినియోగదారుల దినోత్సవం


మెళియాపుట్టి : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చలం

సందర్భంగా కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కన్స్యూమర్ క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్.వి.చలం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీరాములు, కె.గణేష్‌కుమార్, పి.రామారావు, అర్జునుడు, సి.ఆదినారాయణ పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం, తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన జాతీయ వినియోగదారుల దినోత్సవం వారోత్సవం నిర్వహించారు. క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్.వి.చలం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రామారావు, ధనలక్ష్మి, బి.మధుబాబు, అప్పలస్వామి పాల్గొన్నారు.

27న సోనీ వర్క్‌షాప్

పాతపట్నం: స్థానిక ఎఎస్ఎం ప్లాజాలో డిసెంబరు 27న విశాఖకు చెందిన గౌరీ కెమెరా వరల్డ్ ఆధ్వర్యాన సోనీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఫొటోగ్రాఫర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తూలుగు భుజంగరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయం ప్రాంగణంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌కు కెమెరా మెళకువలను తెలపడానికి షమీర్, అశ్రాఫ్‌లు పాల్గొంటారని అన్నారు. నియోజకవర్గంలోని ఫొటోగ్రాఫర్లు ఈ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7989367021, 9542541211 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి జగదీష్

శ్రీకాకుళం : సర్వవ్యాధి నివారణకు ఆయుష్ శాఖ ఆధీనంలో మందులు ఉన్నాయని, ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా చికిత్సతో పాటు అవసరమైన మందులూ రోగులకు అందిస్తామని జిల్లా ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యాన బుధవారం వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఎపి రాష్ట్ర ఆయుష్ విభాగం, కేంద్ర ప్రభుత్వ ఆయుష్ విభాగం సారధ్యంలో నెల రోజుల పాటుదేష్ కా ప్రకృతి పరీక్షాన్ అభియాన్ పేరుతో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 36 ఆయుర్వేద ఆస్పత్రులు, 8 జాతీయ ఆరోగ్య మిషన్ ఆస్పత్రులు నడుస్తున్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆయుష్ విభాగం ఆస్పత్రి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటాక్ సహాయ కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, సీనియర్ తెలుగు అధ్యాపకులు బొడ్డేపల్లి ప్రసాదరావు, విశ్రాంత వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కూన వేణుగోపాల్, గేదెల లక్ష్మి, మహిళా డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అడపా మోహనరాజ్, విశ్రాంత ఎంఇఒ సెంచులాపు సింహాచలం పాల్గొన్నారు.

కిశోర వికాసంతో సంపూర్ణ అభివృద్ధి


మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

ప్రజాశక్తి-భామిని

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు, సంపూర్ణ అభివృద్ధికి కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్ రాణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ పిఒ శాంతి భవాని అధ్యక్షతన బుధవారం కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టిసారించేలా అవగాహన కల్పించాల న్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల వల్ల నష్టాలపై వివరించాలని చెప్పారు. బాలికల ఆత్మరక్షణపై, ప్రతీ గ్రామంలో బాలికల సంఘాలు ఏర్పాటుపై, ఆన్‌లైన్ వేదికలపై అవగాహన కల్పించాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, బాలికల సంపూర్ణ ఎదుగుదలని నిరోధించే అడ్డంకులను సమిష్టిగా తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, ఎస్ఐ డి.అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి, ఎంపిడిఒ చంద్రరావు, ఎంఇఒ వి.భాస్కరరావు, ఐసిడిఎస్ సిబ్బంది శ్రీధర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సముదాయాలు వాయిదా

టెక్కలి : విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రతినెలా పాఠశాలల వారీగా నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు వా యిదా పడ్డాయి. వాస్తవంగా ఈ నెల 19,20 తేదీల్లో సముదాయాలు నిర్వహించాలి. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్ఎ పరీక్షల్లో గణితం పరీక్ష వాయిదా పడడం, ఆ పరీక్ష 20న నిర్వహించడంతో సముదా యాలు వాయిదా పడ్డాయి. పరీక్షల అనంతరం నిర్వహించాలంటే క్రిస్మస్ సందర్భంగా ముందురోజు, తర్వాత రోజులు ఐచ్ఛిక సెలవు. దీంతో ఈ నెల 27, 28 తేదీల్లో సముదాయాలు నిర్వహించాలని విద్యాశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎప్పటి మాదిరిగానే ఈ నెలా రెండు మండలాలకు ఒకచోట చొప్పున సముదాయాలు నిర్వహించనున్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

21న జగన్ పుట్టినరోజు వేడుకలు

కోటబొమ్మాళి: ఈ నెల 21న టెక్కలి రాజశేఖర్‌రెడ్డి విగ్రహ అవరణలో నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షులు నూక సత్యరాజు, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడారు. టెక్కలిలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని అన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు కోటబొమ్మాళి చేరుకొని ఇక్కడనుంచి టెక్కలి వెళ్తామని తెలిపారు. వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సంపతిరావు హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, కాళ్ల సంజీవరావు, కోతి చిన్నారావు, బి.వెంకటరమణ, బి.చెంచులు, ఆర్.శివారెడ్డి పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎస్ఐ చిన్నంనాయుడు

పురుషోత్తపురం కాలనీలో కార్డాన్‌సెర్చ్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పురుషోత్తపురం కాలనీలో పోలీసు జాగిలంతో గంజాయి కోసం ఎస్ఐ చిన్నంనాయుడు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేపట్టారు.


అవగాహన కల్పిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- లావేరు

ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ అన్నారు. మండలంలోని అదపాక కూడలి జాతీయ రహదారిపై బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లేకుంటే కేసులు నమోదు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.